# కముకుదెబ్బ

"దేవతలాంటి వదినకి-

నమస్కారాలు. అంతా క్షేమం.

నా ఈ ఉత్తరాన్ని చూసి ఆశ్చర్యపడాతావో, అసహ్యించుకుంటావో తెలీదు. మొదటిది సహజం. రెండోది నాకే అపనమ్మకం.

ఈ ఉత్తరం ఎలా ప్రారంభించాలో తెలీక ఈ రకంగా ప్రారంభించాను. నీకు నా సానుభూతి తెల్పడానికి ఈ ఉత్తరం రాస్తున్నానని అనుకోకు. నాలో కలిగిన చలనం నా చేత ఈ ఉత్తరం రాయించింది.

అన్నయ్య మన్ని విడిచి స్వర్గలోకంలో వుండి వుంటాడు. మనల్ని, ముఖ్యంగా నిన్నూ, భావనినీ అనాధల్ని చేసి వెళ్ళిపోయాడు. మంచికి రోజులున్నాయా? అంటే లేవని కచ్చితంగా చెప్తాను.

అన్నయ్య, ఆయన్ని కట్టుకుని, పెద్ద కోడలిగా ఈ ఇంట్లోకి అడుగు పెట్టిన నువ్వు ఏం అనుభవించారు? ఈ ఇంట ఇద్దరూ కష్టాలనే రుచి చూశారు.

నాన్న పోయినప్పుడు అక్కలూ నేనూ చిన్నవాళ్ళం, అన్నయ్య చదువు మానేసి ఉద్యోగంలో చేరి ఇల్లు నడిపి వుండకపోతే మేము ఏ పరిస్థితుల్లో వుండేవాళ్ళం? అన్నయ్య మెతకతనమో, నెమ్మదో తెలీదు - దాన్ని అలుసుగా తీసుకుని నిన్ను అమ్మా, అక్కలూ ఆడే మాటలూ, పెట్టే బాధలూ భరిస్తూ నువ్వీ ఇంట్లో నిలబడ్డావు. గట్టిగా నువ్వు "మనం వేరే కాపురం పెట్టుకుని, వాళ్ళ కింత డబ్బులిచ్చేద్దాం" అని వుంటే ఏం చేసి వుండేవాళ్ళం? కానీ అలా అనకుండా మాతోనే వుండి, మేం పెట్టిన బాధల్ని భరిస్తూ వున్నావంటే నీలోని మంచితనాన్ని ఎలా పొగడాలి? నీ మంచిని ఇంట్లో ఎవరు గ్రహించారంటావు? ఒక్క రోజు మీ భార్యా, భర్తలు నవ్వుకుంటూ ఒక సినిమాకి గానీ, ఒక్క రోజు షికారుకి గానీ వెళ్ళడం ఎరుగను. రోజల్లా చాకిరీ చేసి, చేసి ఏ అర్థరాత్రికో అన్నయ్య గదిలోకెళ్ళే వదిన్ని చూసి ఒక్కళ్ళం జాలిపడేవాళ్ళం కాదు.

నిన్ను ఒక పనిమనిషిగా, వంట మనిషిగా, ఇంకా చాలా నీచంగా ఇంట్లో అంతా చూసేవాళ్ళం. ఇంత చాకిరీ చేసినా నిన్ను గుర్తించిందెవరు? నాలిక తెగిన మేకలా ఎప్పుడూ ఇంట్లో అంతా అనే మాటల్ని భరిస్తూ. నీ జీవితాన్ని ఎలా గడిపావని అనిపిస్తోందిప్పుడు.

అప్పుడు నేనూ మా అక్కలూ, అమ్మలతో కలిసి నిన్నాడిన మాటలు మర్చిపోలేదొదినా! ఈనాడు నేను నిన్నాడిన ప్రతీ మాటా గుర్తొచ్చి సిగ్గుతో చితికిపోతున్నాను. మా అక్కలూ, అమ్మా ఆడే ప్రతీ మాటకీ వంత పాడేవాడిని.

ఒకరోజు నువ్వు అన్నయ్యతో "నాకూ ఓ పిల్లో, పిల్లాడో కావాలని వుందండీ!" అనడం, అన్నయ్య నీతో "మనకి సొంత పిల్లలు పుడితే మమకారంతో ఇంటి బాధ్యత మర్చిపోతాం. లేదా పిల్లలకి సరైన రక్షణ కలిగించలేక పోతాం వందనా! చెల్లెళ్ళ పెళ్ళిళ్ళు, తమ్ముడి చదువూ అయ్యాకా మనం మన పిల్లల్ని జాగ్రత్తగా పెంచుకోగలుగుతాం" అని అన్నయ్య అనడం విన్న నేను మర్నాడు అన్నయ్య లేని టైము చూసి అందర్కీ ఆ మాటలు చెప్పి, "దీనికి పిల్లలు కావాలిట, మేమేం అయిపోయినా అక్కర్లేదు, పిల్లలతో కులుకుదామనుకుంటోంది అన్నయ్యకి నేర్పిపెడుతోందే, నిన్న నేను విన్నానూ – దీన్నసలు చెప్పు తీసుకుని కొడితే బుద్ధొస్తుందేమో! నేనయితే దీన్ని ఆ పని చేసి వుండేవాడిని. అన్నయ్య చాతకాని చవట, దద్దమ్మ గనక ఏదో నెమ్మదిగా చెప్పాడు" అని అనడం. నలుగురూ నానా మాటలూ అనడం మర్చిపోలేని సంఘటన. అంతా అన్ని మాటలు అన్నా నువ్వు నోరు విప్పలేదు. ఆ సంఘటన గుర్తొచ్చినప్పుడల్లా బాధపడుతూ వుంటాను. ఆ టైములో అక్కలు గానీ, అమ్మగానీ "వదిన్నలాంటి మాటలనొచ్చా? వాళ్ళకీ పిల్లలు కావాలని వుండదా?" నాకు చీవాట్లు వేసి ఉంటే? మీకూ ఓ చిన్న సంసారం ఏర్పాడాలనీ, పిల్లలతో మీరూ ముద్దు ముచ్చట్లు తీర్చుకోవాలన్న సరదా వుంటుందనీ ఆలోచించామా? మా స్వార్థంతో మీ జీవితాల్లో ఒక్క పువ్వు పుయ్యనివ్వలేదని ఆలోచించామా? మా కోసం మీరు చేసిన త్యాగం ఇప్పుడు తెలుసుకున్నాను. అసలు అలాంటప్పుడు నన్ను నాలుగు చీవాట్లేసివుంటే? కానీ అమ్మ మాకు పెద్దవాళ్ళకి గౌరవం ఇమ్మని ఎప్పుడు నేర్పింది గనక!

అన్నయ్య అన్నట్లే అక్కలిద్దరి పెళ్ళిళ్ళూ మీరు చేశారు. నాకు ఇంజనీరింగ్ చెప్పించారు. అంతటితో అయిందా? అక్కయ్యలు బావగార్లతో పండగలకి రావడం, అక్కయ్యల శ్రీమంతాలూ, పురుళ్ళూ, బారసాళ్ళూ, బారసాళ్ళకి పిల్లలకి బంగారాలు కొనమని అమ్మ చేసే గొడవ, అన్నయ్య కొనలేకపోతే నీ చేతి గాజులూ, మెడలో గొలుసూ ఇచ్చేసినట్లు అందరికీ తెలిసినా తెలీనట్లు ఊరుకున్నారే గానీ, "అయ్యో అన్నయ్య నెత్తిమీద తలకి మించిన భారం పెడుతున్నాం, వదిన మధ్యలో నలిగిపోతోంది" అని ఒక్కళ్ళయినా, ఒక్కసారయినా అనుకోలేదు. పైగా "పెడతారు ఎవరికోసం పెడతారు?" అని అనుకునేవారు. ఇంత చేసినా ఏదో లోటు జరిగినట్లే ఏడుపులూ, పెడబొబ్బలతో వెళ్ళేవారే తప్ప ఆనందంగా వెళ్ళలేదు. అందరి మాటా అలా వున్నా నేను కూడా అన్నయ్యనీ, నిన్నూ అర్థం చేసుకోకుండా, నిన్ను ఎంతెంత మాటలాడేవాడినో తల్చుకుంటే సిగ్గుతో కుంచించుకుపోతున్నాను.

ఒక్కరోజు నిన్ను కడుపునిండా అన్నం తిననిచ్చామా? నీ జీవితాన్ని నరకం చేసి, నువ్వు బాధపడుతుంటే ఆనందించేవాళ్ళం. ఎప్పుడో పెళ్ళిలో జరిగిన లోటుపాట్లు గురించి దెప్పడమే

కాదు, నాతోపాటు నీ తల్లిదండ్రుల్ని కూడా నోటికొచ్చినట్లు అనే వాళ్ళం. వదినా! నువ్వు నిజంగా మనిషివేనా? లేక చెట్టువా? గోడవా?! అన్ని మాటలు పడుతూ పెదవి కదపని మనిషిని నిన్నే చూసాను వదినా!

ఆనాడు నిన్నో చాతకాని దానిలాగ, అన్నయ్యని ఓ దద్దమ్మలాగ అంచనా వేసుకునేవాళ్ళం - కానీ మీ మంచితనాన్ని గ్రహించలేదు. ఒక్కసారి మీరిద్దరూ తిరగబడివుంటే - మాగతి ఏమయ్యేది? "నేనూ, నా పెళ్ళాం వేరే వుంటాం, నాన్న ఏమీ ఆస్తి ఇవ్వలేదు, మీకేం పెట్టనవసరం లేదు, ఎక్కడికి పోతారో పొండి" అని అన్నయ్య అనివుంటే ఈనాడు అక్కయ్యలిద్దరూ హాయిగా ఇలా పిల్లా పాపలతో కాపరాలు చేసుకుంటూ వుండేవారా? నేను ఇంజనీర్నయి ఇంతటి ఉద్యోగంలో చేరి వుండేవాడినా?

అన్నయ్య మా అందర్నీ సెటిల్ చేసిన తరువాత నీ కోరిక తీర్చాడు. సొంత కూతురుకు, భావనకి ఏం చేశాడు? ఏం ముద్దు ముచ్చట్లు చూసుకున్నాడు? నిజంగా దేముడు కూడా ఎంత నిర్దయామయుడో అనిపిస్తుంది.

రాక్షసిలాంటి అత్తగారు (అమ్మ) పోయింది. లంకలో పెట్టవలసిన అక్కలిద్దరూ అత్తవారిళ్ళకెళ్ళిపోయారు. దుర్మార్గుడినైన నేను ఉద్యోగరీత్యా వేరే వూరొచ్చేసాను. చంటి దానితో అన్నయ్యా, నువ్వూ హాయిగా ఆనందంగా కాలం వెళ్ళబుచ్చవలసిన సమయంలో అన్నయ్యకి ఏక్సిడెంట్ జరగడం, నీ వాటా ఇల్లు అమ్మేసి వైద్యం చేయించినా అన్నయ్య దక్కకపోవడం విధి వైపరీత్యం కాకపోతే ఏమిటి? అన్నయ్య కుటుంబానికింత చేశాడు. అంతా వచ్చి "అయ్యో వదినా! అన్నయ్యకి ఏక్సిడెంట్ అయిపోయాడా?" అని ఓసారి ఏడ్చి వెళ్ళిపోయారే గానీ, ఒక్కళ్ళయినా "నీ ముందు గతి ఏమటి?" నీ భవిష్యత్ ఏమిటి? నీ వెనక ఏముంది, ఎలా బ్రతుకుతావు?" అని ఆలోచించారా? అడిగారా? అందరి సంగతీ అలావుంచు, నాకయినా చీమ కుట్టలేదే! ఇప్పుడు నా గురించి నేను తల్చుకుని, తల్చుకుని బాధపడుతున్నాను. ఎందుకో తెల్సా?! ఆనాడు అంతా స్వార్థపరులమే అయిపోయాం. మాలో ఒక్కళ్ళం మీరు చేసింది గుర్తుతెచ్చుకోలేదు.

"అవన్నీ ఇప్పుడెలా గుర్తొచ్చాయి - వేలకి వేలు సంపాదించుకుంటున్నావు, ఇంత అకస్మాత్తుగా నేనెందుకు గుర్తొచ్చా"నని అనుకుంటున్నావు కదూ వదినా!

నీకు తెలుసు నేను ప్రేమించి పెళ్ళి చేసుకున్నాననీ. మన కులం కాని అమ్మాయిని చేయసుకున్నానీను. అప్పుడు నువ్వు పంపిన గ్రీటింగ్ కార్డు కూడా అందింది. ఆ తరువాత అక్కలు నిన్ను అన్నట్లే నా భార్య నీ ఇష్టమొచ్చినట్లు మాటలు అంటూ ఉత్తరాలు రాసేవారు. అంత గడించుకుంటోన్న అక్కలకి ఏమీ పెట్టడంలేదని నానా మాటలూ ఆడుతూ రెండు రోజులకో వుత్తరం రాసేవారు. ఆ ఉత్తరాలు చూసి మా ఆవిడ నా మీద విరుచుకుపడేది. అక్కలకి గట్టిగా ఉత్తరాలు రాసేది. అది అలా పెద్ద రాద్ధాంతం అయి అక్కలకీ, నాకూ మధ్య సంబంధాలు తెగిపోయాయి. అప్పుడు నీ మంచితనమేమిటో, అక్కయ్యల దుర్బుద్ధులేమిటో

తెలిసాయి. ఓసారి అక్కయ్యలకి గట్టిగా నేను ఉత్తరం రాశాను. అంతే – మళ్ళీ ఒకళ్ళ నొకళ్ళం పట్టించుకోలేదు. ఇప్పుడర్థమవుతోంది వదినా నీ శాంతం, ఓర్మీను. నీకు నా మనోవేదనని, నా బాధనీ ఎలా వ్యక్తం చెయ్యాలో తెలీటంలేదు. అందుకే ఈ ఉత్తరం.

నీవు ఏదో చిన్న ఉద్యోగం చేసుకుంటూ భావనని పెంచుకుంటున్నావని తెలిసింది వదినా! అన్నయ్య మాకు చెయ్యడం, నువ్వు కూడా నీ చీమూ, రక్తం ధారపోసి మమ్మల్ని ఇంతింత వాళ్ళని చేసి, నువ్వు అంత చిన్న ఉద్యోగంలో కాలం వెళ్ళబుచ్చుతున్నావంటే ఎంతో బాధగా వుంది. అక్కలెంత మూర్ఖులో నన్నూ, నా భార్యనీ నానా మాటలూ అన్నాక తెలిసొస్తోంది. వదినా గతాన్నంతా మర్చిపోయి, ఈనాటికీ మాలో ఎవ్వర్నీ పల్లెత్తుమాట అనకుండా కాలం గడుపుతున్నావంటే చాలా ఆశ్చర్యంగా వుంది.

నన్ను క్షమించు వదినా! నా తప్పుల్ని మన్నించు. మమ్మల్ని ఇంతింత వాళ్ళని చేసిన మీ బాధ్యత ఇప్పుడు నాపైన వుంది. నిన్నూ, భావననీ నేను చూసుకుంటాను. నువ్వు నన్ను మన్నించి ఇందులో పంపిస్తున్న పాతికవేల రూపాయల డిడిని బ్యాంకులో వేసుకో!నీ అవసరాలకి వుంటుంది. నెల నెలా రెండేసి వేల చొప్పున డబ్బు పంపిస్తాను. భావన చదువుకీ, నీ ఖర్చులకీ వుంటాయి. కాదనకు. కాదనకు వదినా!

ఇట్లు నీ మరిది

సూర్యం"

అంటూ సూర్యం ఉత్తరం రాసి పోస్టు చేసి ఇంటికొచ్చాడు.

ఇంటికొచ్చిన అతని మనసు ఆనందంతో ఊగిపోతోంది. తను చేసిన తప్పుడు పనిని ఇన్నాళ్ళకైనా సరిదిద్దుకున్నందుకు నిర్మలంగా నిద్రపోయాడు సూర్యం.

సరిగ్గా వారం రోజులు తిరక్కుండా వదిన దగ్గర నుంచి ఉత్తరం వచ్చింది. ఆ కవరు చూసుకుని వదిన వదినే – నా డిడి అందుకుని ఆశీర్వదిస్తూ ఉత్తరం రాసి వుంటుంది అని కవరు చింపాడు సూర్యం.

"చి॥ సూర్యానికి మీ వదిన చిరాయువుగా దీవించి వ్రాయునది. నీవు ప్రేమతో రాసిన ఉత్తరం అందింది. చాలా సంతోషం. నీ ఆప్యాయతకి ధన్యవాదాలు. అవసరం వచ్చినప్పుడు తప్పక నీ సహాయం తీసుకుంటాను. ప్రస్తుతం రోజులు బాగానే గడుస్తున్నాయి. నెలనెలా డబ్బు పంపవద్దు" అంటూ రాసి తను పంపిన డిడిని తిప్పి పంపిన వదిన ఉత్తరం చదివి, "వదిన ఒక్క శాంతమూర్తే కాదు – ఎంత పౌరుషవంతురాలో కూడా తొలిసారి తెలుసుకున్నాను" అనుకున్నాడు సూర్యం.

– పత్రిక, నవంబరు 2005